# పై చదువులు

--నిడదవోలు మాలతి

అలనాటి నేస్తం చక్రధరం రామకోటికి ఉత్తరం రాసేడు. రామకోటికి ఓపూటంతా ఆలోచిస్తే గాని గుర్తుకి రాలేదు ఈ చెలికాడు. గుర్తుకొచ్చిం తరవాత "అవునుసుమా. వక్రధరం అనేవాళ్లం. అతని లాజిక్కు అతనికే గాని మరెవరికీ అర్థం అయేది కాదు. ఆరోజుల్లో చెట్టాపట్టాలేసుకు తిరిగినవాళ్లమే" అన్నాడు భార్యతో. వలస వచ్చేశాక పాతస్నేహాలు మర్చిపోయేనే అని ఒకింత నొచ్చుకున్నాడు కూడా.

ఉత్తరం మామూలే. అందరూ క్షేమం అంటూ మొదలయి మావాడు మీదేశం వస్తున్నాడు, నువ్వున్నావు కదా చూసుకుంటావంటూ ముగిసింది...

తన పెద్దకొడుకుని తీసుకుని నెలరోజుల్లో దిగుతున్నాడాయన.

"ఏం చేద్దాంవంటావు?" అని అడిగాడు భార్యమొహంలోకి చూస్తూ.

ఇలాటి విషయంలో ఇష్టాలూ కష్టాలూ ఇద్దరికీ అవగతమే. అవునన్నా తప్పే కాదన్నా తప్పే. ఓపక్క మనవాళ్లకేదో చేద్దాం అన్న తపన, మరో పక్క తీరా తీసుకొచ్చాక ఆ చిన్నవాడు ఏం తంటాలైస్తాడో అన్న భయం.

వాళ్లు అలా తర్జన భర్జనలు చేస్తూండగానే, చక్రధరంనించి మరో టెలిగ్రాం వచ్చింది ఫలానా ప్లేనులో దిగుతు న్నాం, ఏయిర్‌పోర్ట్‌కి వచ్చి రిసీవ్ చేసుకోమని.

"ఆడపిల్లని అత్తారింటికి పంపినట్టు ఆయన కూడా వస్తున్నాడా?" అంది రాజేశ్వరి చిన్నగా నవ్వుతూ.

"విత్తం కొద్దీ విభవం. డబ్బుంటే సరి. ఎలాటిసరదాలయినా బాగానే ఉంటాయి" అన్నాడు రామకోటి.

చక్రధరం సుపుత్రుడు సనత్‌కుమార్‌తో ఆర్భాటంగా దిగాడు సరికొత్తసూట్‌లోనూ నాలుగు సూట్‌కేసుల్తోనూ. రామకోటి ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లి వాళ్లని ఇంటికి తీసుకొచ్చాడు.

ఆనవాయితీప్రకారం చక్రధరం పెట్టెల్లోంచి ఆవకాయా, వడియాలూ, పట్టుచీరా, పసుపుకొమ్ములూ తీసి కామాక్షి ముందు ఉంచుతూ, "మన ఆచారాలు, చాదస్తం. మీకు నచ్చుతాయో నచ్చవో అన్నాను కాని మీ వదినగారు ఒప్పుకోలేదు," అన్నాడు.

"మాకిక్కడ ఆవకాయలూ వడియాలే గొప్పండి. చీర మాత్రం అనవసరంగా తెచ్చేరు. ఉన్న చీరలు కట్టుకోడానికే సందర్భాలుండవిక్కడ," అంది రాజేశ్వరి మొహమాటపడుతూ.

"ఫరవాలేదులెండి. కావాలనుకున్నప్పుడు క్షణాలమీద బజారుకెళ్లి తెచ్చుకుందాం అంటే జరగదు కదా ఇక్కడ!"

సనత్‌కుమార్ స్నానం చేసి పైజామా లాల్చీ ధరించి వొచ్చాడు. ఓ మోస్తరు పొడుగూ, ఓచాయ తక్కువే అయినా బెంగాలీవాడిలా ఉన్నాడు ధరించిన దుస్తులమూలంగా. రాజేశ్వరికెందుకో అతని వరస తమాషాగా అనిపించింది.

ఇదీ అని స్పష్టంకాని సందేహాలు మనసులోనే తలెత్తాయి.

మాటలసందర్భంలో తెలిసిన విషయాలు – నలుగురు పిల్లలు, ఇద్దరు పోగా, మిగిలిన ఇద్దరిలో సనత్‌కుమార్ పెద్దవాడు. తాతగారి పేరు సన్యాసయ్యని మోడర్నైజు చేసి సనత్‌కుమార్ అని పెట్టుకున్నారు. చిన్నప్పట్నుంచీ బుద్ధిగా చదువుకుంటున్నాడు. అంచేత పైచదువులు చదివించి వృద్ధిలోకి తీసుకొచ్చే ప్రయత్నం పదేళ్లప్పుడే మొదలయింది.

భోజనాలకూర్చున్నారు. సనత్‌కుమార్ ఇబ్బందిగా చూశాడు.

చక్రధరం నవ్వుతూ, "వాడికి చేత్తో తినడం అలవాటు లేదు. ఫోర్కుంటే పడెయ్యండి తల్లీ? నాకు ఫరవాలేదు. వాడికే ఆ షోకులన్నీ," అన్నాడు.

"దానికేంలెండి," అంటూ రాజేశ్వరి ఫోర్కూ, స్పూనూ తెచ్చి ఇద్దరికీ అందించింది.

కట్లరీ ఇచ్చినా సనత్‌కుమార్ సరిగ్గా తినలేదు.

"మీ అమ్మగారి వంటల్లా లేవు కాబోలు," అంది రాజేశ్వరి సన్నగా వవ్వుతూ.

"వాడింత ఖారాలు తినలేడు. బ్రెడ్ లేదూ? సాండ్విచ్ వాడే చేసుకుంటాడు," అన్నాడు తండ్రి.

రాజేశ్వరి తెల్లబోయి, అంతలోనే తెలివి తెచ్చుకుని, "అయ్యో, దానికేంలెండి. ఉండండి. తెస్తాను.. మామూలుగా మనదేశంనించి వచ్చినవాళ్లు కొన్నాళ్లదాకా మన రుచులే తింటారని చేసేను. రాత్రికి కారాలు తగ్గించేస్తాను" అంది.

"అయ్యో! మరీ అంత పట్టింపుల్లేవండీ. రోములో ఉన్నప్పుడు రోముపద్ధతులే మరి. వాడికోసం వేరే శ్రమ పడకండి," అన్నాడు కాని రాజేశ్వరికి అలా వినిపించలేదు ఆయనమాటలు. భోజనం అయేలోపున ఆయన ఆ కుర్రాణ్ణి ఎంత పక్కాగా "పైచదువుల"కోసం తీర్చి దిద్దేరో తేటతెల్లం అయిపోయింది.

చేత్తో ఏదీ ముట్టుకోడు. ముట్టుకుంటే తప్పకుండా "సుబ్భరంగా" సబ్బుతో చేతులు కడుక్కుంటాడు. చెప్పుల్లేకుండా ఇంట్లో కూడా తిరగడు. బ్రెక్‌ఫాస్టూ అవీ అన్నీ అమెరికా పద్ధతులే. "మీకేం శ్రమ ఉండ కూడదనీ" అన్నాడాయన తమ తర్ఫీదుగురించి ముప్ఫయ్యోసారి. "ఇక్కడ పుట్టినట్టే అనుకోండి" అని మరో విసురు కూడా జోడించారు.

రాజేశ్వరికి కొంచెం ఇబ్బందిగా ఉంది ఈ సంభాషణ.

భోజనాలయినతరవాత టీ తాగుతారా అంది.

తండ్రీ కొడుకూ మొహాలు చూసుకుని "మీరేం తాగితే అదే "అన్నారు. మరో క్షణం ఆగి "కాఫీ అయినా ఫరవాలేదు" అన్నాడు సన్నీ.

వాళ్లమాటల్లో ఏదో అంతరార్థం స్ఫురించింది రాజేశ్వరికి. ఏం అనాలో తోచడంలేదు. మామూలుగా ఇక్కడ ఉన్న మనవాళ్లు మనభోజనాలకే ఇష్ట పడతారు. మరీ ఇంత చాదస్తంగా–అడుగెడుతూనే పిడుగు – ప్రతిక్షణం తమరు అమెరికాలో ఉన్నాం అన్న సంగతి గుర్తు చేసుకోడం ఎబ్బెట్టుగా ఉంది.

రాజేశ్వరి కాఫీ పెట్టడానికి కిచెన్‌లోకి వెళ్లింది. చక్రధరం సిగరెట్ వెలిగిస్తూ "ఆష్ట్రే లేదా?" అన్నాడు, రామకోటికీ సన్నీకీ పాకెట్ అందిస్తూ.

రామకోటి తను కాల్చననీ, ఆష్ట్రే లేదనీ తెలియజేశాడు.

"మాకు భోజనం అయింతరవాత తప్పనిసరి. ఈ దురలవాటు మాత్రం పోలేదు," అన్నాడాయన నవ్వుతూ, సిగరెట్ నుసి ముందున్నప్లేట్‌లో దులుపుతూ.

కాఫీలో పాలు పొయ్యబోతే అవి విరిగిపోయినట్టు తెలిసింది. "పాలు విరిగిపోయాయి. ఇప్పుడే వస్తాను" అంటూ బయల్దేరింది.
"మీరెందుకండీ. సన్నీ వెళ్తాడు." అన్నాడు చక్రధరం.
కామాక్షి అతని వేపు చూసింది. "నేను వెళ్తాను" అన్నాడు సన్నీ తండ్రివేపు చూస్తూ. అతనెప్పుడు బజారు చేసి ఎరగడు, దేశంలో ఉన్నప్పుడు. అదంతా తమ్ముడి వొంతు!
"తాళాలేవీ?"
రాజేశ్వరి కొనకళ్ల రామకోటివేపు చూసింది. అతను బుద్ధిమంతుడిలా తలొంచుక్కూచున్నాడు. చక్రధరం ఆవిడ మొహం లోకి చూస్తూ, "మనవాడికి డ్రైవింగూ అదీ అంతా క్షుణ్ణంగా వొచ్చు. ఇంటర్నేషనల్ లైసెన్స్ కూడా తీసుకున్నాడు. మీకేం భయం అక్కర్లేదు," అన్నాడు తల తాటిస్తూ.
ఈ "మన" ధోరణి ఇండియాలో చెల్లుతుంది కాని ఇక్కడి దారి వేరు. కాని ఆమాట చెప్పడం ఎలా?
రాజేశ్వరి ఇరకాటంలో పడింది. కారణం ఏదేనా కానియ్ ఆవిడ కారు ఇంతవరకూ మరెవరూ వాడలేదు. ముందెన్నడూ అలాటి అవసరం రాలేదు. పైగా షాపెక్కడ అని అడక్కముందే కారు తాళాలేవీ అన్న కుర్రాణ్ణి ఎలా నమ్మడం? తండ్రి వత్తాసు కూడాను!

రామకోటి కుర్రాడ్ని చూసి సరదా పడుతున్నాడో, తనఅవస్థకి ఆనందిస్తున్నాడో సరిగ్గా తెలీడం లేదు కాని అతని పెదవులమీద చిర్నవ్వు చూస్తే రాజేశ్వరికి మహా చిరాకేసింది. అతన్ని తినేసేలా చూస్తూ, "లేదండీ. మీఅబ్బాయిగురించి కాదు నాభయం. ఇక్కడ ఇన్సూరెన్సు గొడవలూ అవీ ఎక్కువ కదా. నేనే వెళ్తా లెండి. రేప్పొద్దున్న బ్రెక్‌ఫాస్ట్‌కి కావలిసినవి కూడా తెచ్చేస్తే పని అయిపోతుంది.. అతనికి ఇంకా కొత్త గదా. ఇప్పట్నుంచే పని చెప్తే జడుసుకుంటాడు," అంది తనే బయల్దేరుతూ.

రామకోటి చిలిపిగా రాజేశ్వరి మొహంలోకి చూసి లేచాడు. "పాలూ, ఇంకా ఏం కావాలి?" అని అడిగి, సన్నీ వేపు చూస్తూ "పదవోయ్. స్టోరు చూసినట్టుంటుంది కూడా. పైవారం నించీ డ్యూటీలో చేరుదువు గానీ," అన్నాడు.
సన్నీకి ఆ సలహా నచ్చలేదు. వాళ్లనాన్నకి కూడా అది మహా అవమానంగా తోచింది.
"టైరయిపోయానండీ. ఇవాళ్టికి పడుకుంటాను" అని కుర్రాడూ, "టైరయిపోయాడు ఇవాళ్టికి పడుకోనియ్" అని తండ్రీ ముక్తకంఠంతో తమ నిరసన తెలియజేశారు.
రాజేశ్వరి రామకోటి మొహాలు చూసుకోలేదు కాని వాళ్ల మనసుల్లో మాత్రం అలాటి ఆలోచనేదో లీలగా మెదిలింది.

*                    *                    *

మర్నాడు పొద్దున్నే లేచి కాఫీ, బ్రెక్‌ఫాస్ట్ సిద్ధం చేసింది కాని చుట్టాలు లేవలేదు. తనకీ, రామకోటికీ కూడా టైమయి పోతోంది.
"ఏంచేద్దాం?"
"ఇక్కడి పద్ధతులన్నీ తెలిసినవాళ్లే కదా. చిన్న నోట్ పెట్టేసి వెళ్లిపోదాం." అన్నాడు రామకోటి.

"ఏమేనా అనుకుంటారేమో" అంది రాజేశ్వరి అనుమానంగా.
"అనుకుంటే బాధే లేదు," అన్నాడు రామకోటి నర్మగర్భంగా.
అతనిక్కూడా వాళ్లధోరణి బాగులేదని గ్రహించింది.
కాని ఆవిడకి ఊరుకోడానికి మనసొప్పలేదు. ఆఫీసులో పర్మిషనడిగి, లంచివేళకి ఇంటికొచ్చింది వాళ్లు తిన్నారో లేదో చూడ్డానికి. పన్నెండు దాటింది.
వాళ్లిద్దరూ అప్పుడే లేచినట్టున్నారు. ముస్తాబయి, వీధిలోకి బయల్దేరుతూ ఎదురయ్యేరు. ఇంటిముందు కాబ్ ఉంది!
రాజేశ్వరి అయోమయంగా "ఎక్కడికెళ్తున్నారు? బ్రెక్‌ఫాస్ట్ తిన్నారా?" అని అడిగింది.
"బ్రెక్‌ఫాస్టా? మాక్కనిపించలేదే," అన్నారిద్దరూ తమ అసంతృప్తిని ఏమాత్రం దాచుకోకుండా.
"ఫ్రిజ్‌లో ఉంది. ఫ్రిజ్‌మీద నోట్ కూడా పెట్టాను."
"ఫ్రిజా?" ఫ్రిజెక్కడుందన్నట్టున్నాయి వాళ్లమొహాలు.
"మీరు ఇవాళ్టికి శలవు పెట్టారనుకున్నాం" అని కూడా చెప్పేరు తప్పేంవేనా ఉంటే ఆవిడదే అన్నట్టు.
"పోన్లెండి. రేపు తిందాం. ఎక్కడికెళ్తున్నారు?" అంది కాబ్‌వేపు చూస్తూ.
"వూరు చూసొస్తాం. ఊరికే కూచోడం బోరుకదా" అన్నారిద్దరూ.
రాజేశ్వరి సరేనన్నట్టు తలూపి, లోపలికి నడిచింది "ఎలాగా వచ్చాను కదా. లంచి తిని వెళ్తాను" అంటూ.
చక్రధరం, సన్నీ కూడా ఆవిడవెనకే లోపలికొచ్చారు.
"ఏంలేదు. కాబ్‌ని పంపించేశాం. ఎలాగా వచ్చారుకదా. మీరు మమ్మల్ని ఊళ్లో దింపేసి వెళ్లిపోతే మేం వచ్చేప్పుడు కాబ్‌లో వస్తాం" అన్నాడు చక్రధరం.
రాజేశ్వరి మళ్లీ ఇరుకున పడింది. లంచె టైంలో డౌన్‌టౌన్‌కి వెళ్లడం అంటే అపూట గోవిందా. వీల్లేదని చెప్పడమూ కష్టమే. అప్పటికే బ్రెక్‌ఫాస్ట్ విషయంలో వారికి అవమానం అయిపోయింది కదా.
"ఉండండి. ఆఫీసుకి ఫోన్ చేసి వస్తాను," అని లోపలికెళ్లి సంజాయిషీ ఇచ్చుకుని వచ్చింది.
"నువ్వు ముందు కూచోరా," అని తను వెనక సీటులో కూచున్నాడు చక్రధరం.
సన్నీ ముందు సీటులో కూచుని రెడ్ లైటు, గ్రీన్‌లైటు, ఛెంజ్ లేన్ అంటూ చక్కని అమెరికనింగ్లిషులో చెప్తూ తన పరిజ్ఞానాన్ని ప్రదర్శించాడు. అతను ఎందుకు ముందుసీటులో కూచున్నాడో ఆవిడకి అర్థం అయింది.
వాళ్లు కారు దిగింతరవాత సుదీర్ఘమయిన నిట్టూర్పు విడిచిందావిడ.
ఈకథ ఎక్కడికి దారి తీస్తుందో ఆవిడకి బాగా తెలిసిపోయింది. "ఆపద్రక్షకా!" అని మనసులోనే ఓచిన్న యస్ఓయస్ ప్రసారం చేసుకుంది.

రామకోటి సాయంత్రం వచ్చాక జరిగిన నాటకం చెప్పింది. అతనికీ ఏం తోచలేదు.
"ఓ నెలరోజులు కళ్లు మూసుకుంటే అతను డోర్మ్‌కెళ్లిపోతాడు. అతనివరస చూస్తుంటే మళ్లీ మనవేపు చూసేలా లేడు ఎలానూ" అన్నాడు బీన్స్ ముక్కలు తరుగుతూ.
"అందరం సుఖపడతాం" అంది రాజేశ్వరి బియ్యం కొలుస్తూ.
రాత్రి తొమ్మిదయింది. తండ్రీ కొడుకులజాడ లేదు.
"తప్పిపోయారేమో," అంది రాజేశ్వరి భయపడుతూ.

రామకోటికి కూడా అదే అనుమానం వచ్చింది. కాని తామేం చెయ్యగలరు?
"వాళ్లకి వాళ్లయి, బయల్దేరి ఊరుమీద పడ్డారు కాని మనం పంపలేదు కదా. ఎక్కడని వెతుకుతాం?" అన్నాడు రామకోటి.
మరో అరగంట చూసి వాళ్లిద్దరూ తినేశారు. మళ్లీ పొద్దున్నే లేచి ఉద్యోగాల్లోకి వెళ్లాలి కదా.
చక్రధరం, కొడుకుతో వచ్చేసరికి రాత్రి ఒంటిగంటయింది. రామకోటి తలుపు తీసాడు.
"మీరు పనిలో ఉంటారు. ఊరు చూపడానికి తీరిక ఉండదు కదా అని మేమే వెళ్లాం" అన్నాడు చక్రధరం.
"పైగా మనదేశంలోలా కాదుకదా. ఇక్కడ అన్నీ క్రమపద్ధతిలో ఉంటాయి. తెలీనివాళ్లకయితే బాధకానీ..."
"ఏమేం చూశారు?" అన్నాడు రామకోటి టేబుల్‌మీద ప్లేట్లు పెడుతూ.
"ఏదో బజార్లు తిరిగాం. రెండో ఆట సినిమా చూసి వచ్చేసరికి ఆలస్యం అయింది. మీకు కష్టం అవలేదుకదా" అన్నాడు సందిగ్ధంగా చక్రధరం.
రామకోటికి "అవలేద"నక తప్పలేదు. "రండి. భోంచేద్దురుగాని."
"మేం తినేశాం మెక్డనాల్డ్స్‌లో. ఇండియాలోలా కాదు, ఇక్కడ హాంబర్గర్ చాలా రుచిగా ఉంది" అన్నాడు సన్నీ.
అవునన్నట్టు తలూపి రామకోటి చిరునవ్వుతో వంటకాలు ఫ్రిజ్‌లో పెట్టేసి వెళ్లి పడుకున్నాడు.
"వాళ్లు భోజనం చెయ్యలేదా?" అనడిగింది అలికిడి విని లేచిన రాజేశ్వరి.
"తిన్నార్ట" అన్నాడతను ముక్తసరిగా.

*  *  *

నాలుగు రోజులయింది. విజిటమెరికా టికెట్‌తో చక్రధరం దేశం చూడ్డానికి వెళ్లాడు. సన్నీకి క్లాసులు మొదలయేయి. ఆదిలో అనుకున్నట్టుగానే తండ్రి దేశంలో ఉన్నన్నాళ్లు వీళ్లింట్లో ఉండి తరవాత డోర్మ్‌కి మారిపోతానని చెప్పాడు.
కాని ఇంట్లో ఉన్నా లేనట్టే. అర్ధరాత్రి వస్తాడు. ఎప్పుడు లేస్తాడో, ఎక్కడ ఏం తింటున్నాడో, ఎప్పుడింటికి వస్తాడో తెలీడం లేదు. అన్నీ ప్రశ్నలే. స్నేహాలు బాగానే కలిసినట్టుంది. సినిమాలూ, డాన్సులూ, పార్టీలూ, వేడుకలూ...
ఓరోజు మధ్యాన్నం సమయంకాని సమయంలో ఇంటికొచ్చిన రాజేశ్వరిని చూసి సన్నీ గబుక్కున చూస్తున్న విడియో ఆపేశాడు.
"మాఫ్రెండు ఏదో పాత సినిమా ఇచ్చాడు చూడమని. చెత్తగా ఉంది." అన్నాడు రాజేశ్వరి అడక్కుండానే.
"స్నానం చేస్తాను" అంటూ పక్కనుంచి అతను వెళ్తుంటే రాజేశ్వరికి వాడ్కావాసన తగిలింది.

ఆసాయంత్రం సన్నీ ఏం అనుకున్నాడో బయటికెళ్లలేదు. రాజేశ్వరితో కబుర్లు మొదలెట్టాడు.
తన హై ఐక్యూ,
తల్లిదండ్రుల హై ఎక్స్‌పెక్టేషన్స్,
డర్టీ ఇండియా
స్టుపిడ్ ఇండియన్స్...

ఇక్కడ రోడ్లు విశాలంగా ఉంటాయి,
మనుషులు శుభ్రంగా ఉంటారు,
ఇక్కడి మ్యూజిక్కూ, ఇక్కడి మూవీలూ, ఆడపిల్లల తెల్లతొక్కా
ఆఖరికి ఇక్కడి కాగితప్పొట్లాలు కూడా అందంగానే ఉంటాయి...
రాజేశ్వరికి తల తిరిగిపోయింది.
"మీతమ్ముడేం చేస్తున్నాడు?" అంది మాట మార్చడానికి.
"వాడొట్టి లోఫర్. బజారుకెళ్లి కూరలు తేరా అని పది రూపాయలిచ్చి పంపిస్తే, నాలుగు రూపాయలకి కూరలు కొని, నాలుగు రూపాయలు చిరుతిళ్లకి తగలేసుకొస్తాడు."
ఇంతకుముందు చక్రధరం కూడా ఇలాగే మాటాడేడు చిన్నకొడుకు గురించి. పెద్దవాణ్ణి పెద్ద చదువులకోసం మాలీసు చేస్తూ చిన్నవాణ్ణి గోఫర్‌గా చేశారు కాబోలు. వాడు తిరగబడి లోఫరయేడు అనుకుంది రాజేశ్వరి.

ఆ సాయంత్రం రామకోటితో మాటాడుతూ కుర్రాడినిగురించి తన అనుమానాలు వ్యక్తంచేసింది.
"పైచదువులా? పై పై చదువులా?" అంది హేళనగా.
"ఏంచేస్తాం? కొందరివిషయంలో పైమెరుగులకేనేమో ఈ పరుగులన్నీ" అన్నాడు రామకోటి ఆవిడతో ఏకీభవిస్తున్నట్టు.

* * *

రెండువారాలయింది. శనివారం ఉదయం. పూజ పూర్తి చేసుకుని కూచుంది. మామూలుగా వాళ్లిద్దరూ శనివారం ఉదయం కూచుని కర్నాటక సంగీతం వింటూనో భరతనాట్యం టేపులు చూస్తూనో గడుపుతారు. మధ్యాన్నంనించీ మామూలే-- క్లీనింగూ, గ్రోసరీ షాపింగూ, లాన్ మోయింగ్ లేకపోతే స్నో బ్లోయింగ్....

ఫోను మోగింది. రామకోటి తీసుకున్నాడు. అతను "ఘాష్! వెన్?" అంటున్నాడు ఫోన్లో.
రాజేశ్వరి ఉలిక్కిపడి తలెత్తి చూసింది.
రామకోటి ఫోను పెట్టేసి చెప్పాడు. రాత్రి ఘోరమైన ఏక్సిడెంట్ అయిందట!
ఇద్దరూ హడావుడిగా బట్టలేసుకు బయల్దేరారు ఆస్పత్రికి. దారిలో సెల్‌ఫోనులో చక్రధరాన్ని పిలిచి వెంటనే వెనక్కి రమ్మని చెప్పారు. ఆస్పత్రికి వెళ్లింతరవాత కాని వివరాలు తెలియలేదు.
ముందు రోజు రాత్రి మరో ముగ్గురు మిత్రులతో కలిసి సన్నీ ఏదో పార్టీకి వెళ్లాడుట. నలుగురికీ కొత్తే. అప్పుడే ఇండియానించి వచ్చినవాళ్లు.
పార్టీలో మామూలే. పాటలూ, డాన్సులూ, తాగడాలు... రాత్రి మూడయింది. ఒక్కొక్కరే వీధిన పడుతున్నారు. సన్నీ డ్రైవ్ చేస్తున్నాడు. ఏమయిందో తెలీదు కాని కారెళ్లి దారిపక్కనున్న చెట్టుకి కొట్టుకుంది. మిగిలిన ముగ్గురికీ అక్కడికక్కడే ప్రాణాలు పోయేయి. సన్నీ వంటినిండా కట్లతో ఇజిప్షన్ మమ్మీలా పడున్నాడు ఆస్పత్రిలో. స్పృహలేదతనికి. పోలీసులు చెప్పడం అతని బ్లడ్ ఆల్కహాల్ లెవల్ మూడింతలుందట!

చక్రధరం సాయంత్రానికి వచ్చేశాడు న్యూయార్క్‌నించి గాభరాగా. ఆయన పూర్తిగా డీలా పడిపోయాడు. ఈఒక్కదెబ్బతోనూ మనిషి సగానికి తగ్గిపోయినట్టున్నాడు. ఈ కొడుకుమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు.
"వాళ్లమ్మ ఈమాట వింటే గుండె పగిలి చచ్చిపోతుంది. నలుగుర్ని కంది. ఇద్దరు జబ్బుల్తో పోయారు. ఆఖరివాడు దేశాలట్టుకుపోయాడు. వీడిమీదే మాకళ్లన్నీ.."
"ఆం?" అంది రాజేశ్వరి అర్థం కానట్టు.
ఆర్నెల్లయిందిట. చిన్నవాడు ఇంట్లోంచి పారిపోయాడు. బొంబాయిలో ఉన్నాడని ఎవరో అన్నారుకాని జాడ తెలీదు ఇప్పటికీ. ముద్దు చేసి ఒకణ్ణి, మొరటుగా రెండోవాణ్ణి – మొత్తంమీద ఇద్దర్నీ పనికిరానివాళ్లుగా చేసేశారు తల్లిదండ్రులు.
ఆయన్ని చూస్తుంటే రాజేశ్వరికి జాలేసింది. పాపం. పిల్లాణ్ణి పక్కాగా తయారు చేయదల్చుకున్న ఈ పెద్దమనిషి ఓ అందమైనబొమ్మే చూశాడు కాని అవతల పక్క బొరుసుంటుందని గ్రహించలేదు.
అసందర్భంగానే ఎప్పుడో విన్న రామలక్ష్మిగారి హాస్యం జ్ఞాపకంవొచ్చింది "ఎవరికీ కళ్లు వెనక్కుండవు. చూసుకు నడుస్తారంతే!" అన్నారావిడ.
అక్కడ నవ్వితే బాగుండదని హాల్పోలోకి వచ్చేసింది రాజేశ్వరి.

* * *

(ఈ కథలో కారు ఏక్సిడెంటు –కొత్తగా ఇండియానించి చదువులకోసం వచ్చిన ముగ్గురు అబ్బాయిలు నెల తిరక్కుండా దుర్మరణం పాలు కావడం నిజంగా జరిగిన విషయమే. మిగిలిన కథ కల్పితం – మాలతి.)